నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, బుధవారం 22 మే 2024 | RANGAREDDY



పోచారం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సమస్యలను తెలుసుకుంటున్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక

# చివరి గింజ వరకు కొంటాం..

- ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులకు గురికావద్దు
- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- పోచారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్, మే 21 : ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు చివరి గింజా కొంటామని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి సహకార సంఘం పరిధిలోని పోచారం గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా 7995050714 నంబర్ లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1967కు ఫిర్యాదు చేయాలని సూచించారు. తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే లారీల్లో లోడ్ చేసి రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం నిల్వలు లిఫ్టింగ్ జరిగేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర చెల్లించనున్నట్లు రైతుకు భరోసా ఇచ్చారు. తొందరపడి దళారులను ఆశ్రయించి నష్టపోవద్దన్నారు. వర్షాల వల్ల ధాన్యం తడువకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుత సీజన్‌లో 33 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, 17 కేంద్రాల ద్వారా వరి ధాన్యం సేకరిస్తున్నామన్నారు.

కేంద్రాల్లో సమస్యలుంటే నేరుగా జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కలెక్టర్ వెంట ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్, డీసీవో ధాత్రీదేవి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మనోహర్‌కుమార్ రాథోడ్, సివిల్‌సప్లయ్ డీఎం విజయలక్ష్మి, ఇబ్రహీంపట్నం వ్యవసాయాధికారి వరప్రసాద్‌రెడ్డి, ఏఈవో రఘు పాల్గొన్నారు.

# మెట్రో రెండో దశ డీపీఆర్ సిద్ధం



- 70 కిలోమీటర్ల మేర చేపట్టాలని నిర్ణయం
- ఏడు కారిడార్లుగా అలైన్‌మెంట్లు ఖరారు
- జూన్‌లో ప్రభుత్వానికి నివేదిక అందజేత
- నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో కారిడార్‌కు అధిక ప్రాధాన్యత
- సీఎం పరిశీలనకు మెట్రో డీపీఆర్

సిటీబ్యూరో, మే 21 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మహానగరంలో మెట్రో రెండో దశ విస్తరణకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధమవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన 7 మెట్రో కారిడార్‌లలో మొత్తం 70 కి.మీ మేర నిర్మించే మార్గాలకు సంబంధించి క్షేత్రస్థాయిలో సర్వేలు, ట్రాఫిక్ అధ్యయనం, మెట్రో స్టేషన్‌లు, డిపోల నిర్మాణం వంటి అంశాలపై హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ సిస్ట్రా కన్సల్టెన్సీ సంస్థతో పనిచేస్తూ డీపీఆర్‌ను రూపొందిస్తున్నది. డీపీఆర్‌ను రూపొందించేందుకు అవసరమైన క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తికావచ్చిందని, జూన్ నెలలోనే డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందజేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నామని మెట్రో అధికారి ఒకరు తెలిపారు. నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్తు రవాణా అవసరాల దృష్ట్యా, విమానాశ్రయానికి మెట్రో రైలు మార్గం ద్వారా కనెక్టివిటీ ఉండేలా రెండో దశ మెట్రో నిర్మాణాన్ని 70 కి.మీ మేర చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దానికి అనుగుణంగా 7 మార్గాల్లో అధ్యయనం చేసి డీపీఆర్‌ను సిద్ధం చేస్తున్నారు. ఇందుకోసం సుమారు రూ.20వేల కోట్ల వ్యయం అవుతుందని ఇప్పటికే మెట్రో అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దీనిపై ప్రకటనలు చేయకుండా, జూన్ 4 తర్వాత కోడ్ ముగిసిన వెంటనే రెండో దశ మెట్రోకు సంబంధించిన డీపీఆర్‌లను ప్రభుత్వానికి అందజేసేలా కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. పూర్తయిన డీపీఆర్‌లను సీఎం పరిశీలనకు పంపిన తర్వాత కారిడార్‌ల వారీగా టెండర్లు పిలిచే ప్రక్రియను మొదలు పెట్టనున్నారు.

### కారిడార్‌ల వారీగా డీపీఆర్‌లు..

ఎక్కువ మంది నగర వాసులకు ప్రయోజనం కలిగేలా మెట్రో రైలు రెండో దశను నిర్మిస్తున్నారు. ఇందులో ప్రధానంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అనుసంధానం చేసే మార్గాన్ని నాగోల్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట, మైలార్‌దేవ్‌పల్లి, జల్‌పల్లి, మామిడిపల్లిని కలుపుతూ విమానాశ్రయం లోపలి వరకు మెట్రో రూట్‌ను 29 కి.మీ మేర ఖరారు చేశారు. దీంతో పాటు ఇతర మార్గాలకు సంబంధించిన తుది రూట్ మ్యాప్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో హైదరాబాద్ మెట్రో అధికారులు సిద్ధం చేశారు. కొత్తగా ఖరారు చేసిన మొత్తం 70 కి.మీ మెట్రో మార్గాల్లో వివిధ ప్రాంతాలను కలుపుతూ ఉండగా, అందులో అతి పొడవైన మెట్రో మార్గంగా నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు ఉంది. దీని తర్వాత మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు 14 కి.మీ, రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్‌గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు 8 కి.మీ, ఎల్‌బీనగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు 8 కి.మీ, మైలార్‌దేవ్‌పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు 4 కి.మీ, ఫలక్‌నుమా నుంచి చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు వరకు 1.5 కి.మీ, ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ చొప్పున మొత్తం 70 కి.మీ మెట్రో మార్గాన్ని 7 కారిడార్‌లుగా విభజించి డీపీఆర్‌లు రూపొందిస్తున్నారు. కాగా ఇందులోఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మార్గాన్ని మొదటి దశలోనే ప్రతిపాదించారు. మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణంలో ఎంతో అనుభవం ఉన్న సిస్ట్రా కన్సల్టెన్సీ సంస్థ ప్రభుత్వం నిర్దేశించిన మార్గాలకు వేర్వేరుగా డీపీఆర్‌లను రూపొందిస్తున్నది. నగరంలోని అన్ని ప్రాంతాలకు మెట్రో రైలు కనెక్టివిటీని విస్తరించడం ద్వారా భారీ సంఖ్యలో పేద, మధ్యతరగతి వర్గాలకు మెట్రో రైలు సేవలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ మార్గాలను ఎంపిక చేసింది.

### 66 కి.మీతో అత్యంత పొడవైన కారిడార్‌గా..

మొదటి దశలోని కారిడార్-3 (నాగోల్ -రాయదుర్గం) 29 కి.మీ ఉండగా, రెండో దశలో నాగోల్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు మరో 29 కి.మీ, అదేవిధంగా రాయదుర్గం నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ వరకు 8 కి.మీ కలిపి మొత్తం 66 కి.మీ మెట్రో మార్గం అనుసంధానం కానున్నది. దీంతో ఈ మెట్రో మార్గం పొడవు 66 కి.మీ. కాగా నగరంలోనే అత్యంత పొడవైన మెట్రో మార్గంగా మారనున్నది. తర్వాత మొదటి దశలో కారిడార్-1(మియాపూర్-ఎల్‌బీనగర్ 29 కి.మీ) రెండు వైపులా ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 8 కి.మీ, మియాపూర్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు మరో 14 కి.మీ కలిపి మొత్తం 51 కి.మీ పొడవుతో నిర్మాణం కానున్నది. దీనివల్ల నగరంలో ఎక్కడ ఉన్నా శివారు ప్రాంతాలకు మెట్రో మార్గాల ద్వారానే వేగంగా తమ గమ్య స్థానాలకు చేరుకునేలా నిర్మిస్తున్నారు.

### రెండో దశలో చేపట్టే మెట్రో కారిడార్లు

**కారిడార్ 2 :** ఎంజీబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు (5.5 కి.మీ)( మొదటి దశలో ప్రతిపాదించిన మార్గం)

**కారిడార్ 2:** ఫలక్ నుమా నుంచి చాంద్రాయణ గుట్ట క్రాస్ రోడ్డు వరకు (1.5 కి.మీ)

**కారిడార్ 4 :** నాగోల్ మెట్రో స్టేషన్ నుంచి ఎల్‌బీనగర్ మీదుగా చాంద్రాయణగుట్ట క్రాస్ రోడ్డు, మైలార్‌దేవ్ పల్లి, పీ7 రోడ్డు నుంచి శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు (మొత్తం 29 కి.మీ)

**కారిడార్ 4 :** మైలార్ దేవ్ పల్లి నుంచి ఆరాంఘర్ మీదుగా రాజేంద్రనగర్‌లో ప్రతిపాదించిన హైకోర్టు ప్రాంగణం వరకు (4 కి.మీ)

**కారిడార్ 5 :** రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి బయో డైవర్సిటీ జంక్షన్, నానక్‌రామ్ గూడ జంక్షన్, విప్రో జంక్షన్, అమెరికన్ కాన్సులేట్ (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) వరకు (8 కి.మీ)

**కారిడార్ 6:** మియాపూర్ మెట్రో స్టేషన్ నుంచి బీహెచ్‌ఈఎల్ మీదుగా పటాన్‌చెరు వరకు (14 కి.మీ)

**కారిడార్ 7:** ఎల్‌బీ నగర్ మెట్రో స్టేషన్ నుంచి వనస్థలిపురం, హయత్‌నగర్ వరకు (8 కి.మీ)

# జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్ల పోరు ఉధృతం

## రూ.1350 కోట్లు చెల్లించకుంటే.. మాన్‌సూన్, ఐఆర్టీని నిలిపివేస్తాం

### ఎక్కడికక్కడ నిలిచిపోయిన అభివృద్ధి పనులు

సిటీబ్యూరో, మే 21, (నమస్తే తెలంగాణ) : జీహెచ్‌ఎంసీలో కాంట్రాక్టర్ల పోరు ఉధృతమవుతున్నది. పెండింగ్ బకాయిలు చెల్లించే వరకు మెయింటెనెన్స్ పనులు చేపట్టబోమంటూ ఈ నెల 18వ తేదీ నుంచి కాంట్రాక్టర్లంతా పనులు మానేసి 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగానే గడిచిన నాలుగు రోజులుగా రోడ్లు, డ్రైనేజీలు, నాలాలు, కరెంట్ పోల్స్, పార్కులు, ప్లే గ్రౌండ్, శ్మశానవాటికల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ ఇలా మెయింటెనెన్స్ పనులు నిలిచిపోయాయి. తమకు రావాల్సిన రూ.1350 కోట్ల బకాయిలు చెల్లించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ పనులు చేపట్టబోమని, అవసరమైతే మాన్‌సూన్, ఐఆర్టీని నిలిపివేస్తామని అల్టిమేటం జారీ చేశారు. మే నెలకు సంబంధించి రూ.57 కోట్లు విడుదల చేశామని, ఐఆర్టీ పనులను నిలిపివేస్తే సంబంధిత కాంట్రాక్టర్లపై టెండర్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం..అందులో ఒక హామీగా మహిళల కోసం అమలు చేస్తున్న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం పథకం ఆటోడ్రైవర్ల బతుకులను రోడ్డునపడేసింది. ప్రతిరోజూ ఆటో నడిపితే కానీ ముందుకు సాగని వారి జీవితాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఛిద్రం చేసింది. గత నాలుగైదు నెలల ముందు వరకు ప్రతిరోజూ కనీసం మూడు నుంచి నాలుగు ట్రిప్పుల్లో ప్రయాణికులకు వారివారి గమ్యస్థానాలకు చేర్చి రూ.వెయ్యికి పైగా వచ్చిన మొత్తంతో కుటుంబంతో ఆనందంగా జీవించిన ఆటోడ్రైవరన్నా.. కాంగ్రెస్ సర్కారు తీసుకొచ్చిన కొత్త పథకంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. రోజంతా ఆటోను నడిపితే గిరాకీ లేక డీజిల్ ఖర్చులు పోగా రూ.వంద లోపే మిగులుతున్నదని ఈ స్థితిలో ఫైనాన్స్ డబ్బులు, పిల్లలు స్కూల్ ఫీజులు, కుటుంబాన్ని ఎలా పోషించాలో తెలియక మథనపడుతున్నాడు. ఇప్పటికే కొంతమంది ఆటోడ్రైవర్లు అప్పులు, కిస్తీలు, వడ్డీలు, కుటుంబాలను పోషించలేక బలవన్మరణానికి పాల్పడిన ఘటనలు ఉన్నాయని.. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటోడ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరుతున్నారు.

- పరిగి/పెద్దేముల్, మే 21



# ఆటోవాలా.. విలవిల

## ఉచిత బస్సుతో రోడ్డునపడ్డ ఆటోడ్రైవర్లు.. పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- రోజంతా నడిపినా గిరాకీ నిల్
- భారంగా మారిన కుటుంబ పోషణ
- ఈఎంఐలు, పిల్లల స్కూల్ ఫీజులు, వడ్డీలు చెల్లించలేక తనువు చాలిస్తున్న ఆటోడ్రైవర్లు
- ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని వేడుకోలు



### డీజిల్ పైసలూ రావడం లేదు

ప్రతిరోజూ పరిగి నుంచి లాల్‌పహాడ్ దారిలో ఆటో నడుపుతా. ఉచిత బస్సు పథకం రావడంతో మహిళలు ఆటోల్లో ప్రయాణించడంలేదు. గతంలో డీజిల్ ఇతర అన్ని ఖర్చులుపోగా నెలకు రూ.12 వేలకు పైగానే వచ్చేవి. ప్రస్తుతం రోజుకు ఒక ట్రిప్పే వెళ్తుండగా రూ.150 వరకు మిగులుతున్నాయి.. నాకు కుమార్తె, కుమారుడు ఉన్నాడు. ఇద్దరూ డిగ్రీ చదువుతున్నారు. వారిని చదివించాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. - భీమయ్య, ఆటో డ్రైవర్, సుల్తాన్‌పూర్, పరిగి



### కుటుంబం గడుస్తలేదు..

ఉచిత బస్సు ప్రయాణంతో భార్యాభర్తలు ఇద్దరూ ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్తున్నారు. ఆటోల్లో మాత్రం ఎక్కడం లేదు. గతంలో ఆటో నడిపితే రూ.1200 వరకు వచ్చేవి. ప్రస్తుతం రూ.300 కూడా రావడం లేదు. వచ్చిన డబ్బులు డీజిల్‌కు కూడా సరిపోవడంలేదు. కుటుంబ పోషణ, పిల్లల చదువు భారంగా మారింది. రోజువారీ ఫైనాన్స్ రూ.150 చెల్లించాలి.. అంతేకాకుండా ప్రతినెలా ఈఎంఐ రూ. 7 వేలు చెల్లించేందుకు అవస్థలు పడుతున్నా. - పాపయ్య, బాచారం, వికారాబాద్



### ఆటోలకు గిరాకీ లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సు పథకాన్ని అమలు చేయడంతో ఆటోల్లో ప్రజలు ఎక్కడం లేదు. గతంలో రోజుకు డీజిల్ ఖర్చులుపోగా రూ.వెయ్యివరకు వచ్చేవి. ప్రస్తుతం ఫ్రీ బస్సు కారణంగా రూ.300 రావడం లేదు. వచ్చే నెలలో స్కూళ్లు ప్రారంభమవుతాయి. పిల్లల స్కూల్ ఫీజులు, కుటుంబ పోషణ, పుస్తకాలు తలుచుకుంటేనే భయంగా ఉన్నది. రూ.300లతో ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం ఆటోవాలాలను ఆదుకోవాలి.

-శ్రీనివాస్, ఆటో డ్రైవర్ , పెద్దేముల్

### ఆటోల వైపే చూడడంలేదు..



ఫైనాన్స్‌లో ఆటో తీసుకున్నా. ప్రతి రోజూ మన్నెగూడ, వికారాబాద్ ప్రాంతాలకు చెందిన ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేయగా డీజిల్ ఖర్చులు పోగా రూ.500 నుంచి రూ.800 వరకు మిగిలేవి. కానీ ఉచిత బస్సు పథకం వచ్చిన తర్వాత ఆటోలకు గిరాకీ పూర్తిగా తగ్గిపోయింది. మహిళలు అస్సలు ఆటోల్లో ఎక్కడమే మానేశారు. బస్టాండ్ల వద్ద బస్సులు వచ్చే వరకు నిరీక్షించి మరీ ఎక్కుతున్నారు. దీంతో రోజుకు రూ.300 వరకువస్తే డీజిల్ ఖర్చులు పోగా కొద్దిగానే మిగులుతున్నది. ఆ మొత్తంతో కుటుంబాన్ని పోషించడం, పిల్లల చదువులు, పుస్తకాలు, ఆటో కిస్తీని ఎలా కట్టాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి ఆటోడ్రైవర్లను ఆర్థికంగా ఆదుకోవాలి.

- కె.కృష్ణాగౌడ్, చన్గోముల్ గ్రామం, పూడూరు మండలం



### బతుకులు భారంగా మారాయి..

గత నాలుగైదు నెలల నుంచి ఆటోడ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయి. మహిళలు ఆటోల్లో ఎక్కడమే మానేశారు. దీంతో గిరాకీ బాగా తగ్గింది. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఫ్రీ కావడంతో మహిళలు ఎక్కడికైనా ఉచితంగానే వెళుతున్నారు. రోజుకు రూ.రెండు, మూడు వందలు కూడా సరిగ్గా రావడంలేదు. ప్రభుత్వం ఆటోడ్రైవర్ల కోసం కొత్త పథకాన్ని ప్రవేశపెట్టి, ఆర్థికంగా ఆదుకోవాలి.

- నరేశ్‌గౌడ్, ఆటోడ్రైవర్, తాండూరు



### గతంలో ఆరు ట్రిప్పుల వరకు..

ఫ్రీ బస్సు పథకంతో ఆటోలకు గిరాకీలేదు. గత నాలుగైదు నెలల ముందు ఆరు ట్రిప్పుల వరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు తీసుకెళ్లేది. ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితులున్నాయి. మహిళలు అస్సలు ఆటోలు ఎక్కడం లేదు. కుటుంబాన్ని పోషించలేక, ఫైనాన్స్‌లు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. పిల్లల ఫీజులు, పుస్తకాలకు పైసలు ఎక్కడి నుంచి తీసుకురావాలో అర్థం కావడంలేదు. ఆటోడ్రైవర్ల కుటుంబాలు రోడ్డున పడకుండా సర్కారు చర్యలు తీసుకోవాలి.

- యశ్వంత్ ,ఆటో డ్రైవర్ , పెద్దేముల్



### ఫ్రీ జర్నీ మా పొట్ట కొట్టింది..

ఫ్రీ జర్నీ మా పొట్టకొట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పించడంతో వారు అందులోనే ప్రయాణిస్తున్నారు. దీంతో మాకు గిరాకీ తగ్గిపోయింది. గతంలో ఆటోలు బాగా నడిచేవి. మాకు గిట్టుబాటు అయ్యేది. ప్రస్తుతం డీజిల్ ఖర్చులు కూడా రావడంలేదు. ఆటో డ్రైవర్ల జీవితం దుర్భరంగా మారింది. పూట గడవడమే కష్టంగా ఉన్నది.

- బంగారం నర్సింహులు, ఆటో డ్రైవర్, బొంరాస్‌పేట



### పిల్లల ఫీజులు కట్టలేక పోతున్నాం

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో ఆటోల్లో ఎక్కే వారి సంఖ్య తగ్గింది. గతంలో వికారాబాద్ నుంచి ధారూరుకు ఆటోను నడిపితే ప్రతిరోజూ రూ.1500 వరకు వచ్చేవి. ఆ వచ్చిన మొత్తంతో ప్రతి నెలా ఈఎంఐకి రూ.6000, ఇంటి అద్దె రూ.3000, పిల్లల ఫీజులు, కుటుంబ పోషణకు సరిపోయేవి. ప్రస్తుతం ఆటోల్లో మహిళలు ఎక్కకపోవడంతో రోజుకు రూ. 500 వరకే వస్తున్నాయి. వాటితో కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. - పోచయ్య, రాజీవ్‌నగర్, వికారాబాద్





### ప్రభుత్వం ఆదుకోవాలి

మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుతో మా ఆదాయం బాగా తగ్గింది. చిన్న ఫంక్షన్లు, వివాహాలు ఉంటే ఆటోలను మాట్లాడుకుని వెళ్లేవారు. ఇప్పుడు మహిళలు బస్సులు వచ్చే వరకు బస్టాండ్లల్లో నిరీక్షించి అందులోనే వెళ్తున్నారు. అప్పులు చేసి ఆటోలు కొన్న వారు కిస్తీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. ఆదాయం తగ్గిపోయింది. కుటుంబాలను పోషించడం భారంగా మారింది. ప్రభుత్వం ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి. - ఎండీ మక్బూల్, ఆటో డ్రైవర్, బొంరాస్‌పేట



పరిగిలోని ఆటో స్టాండ్‌లో ప్రయాణికుల కోసం ఎదురుచూస్తున్న ఆటో డ్రైవర్లు